జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 30 | ఆగస్టు | 2025 • పేజీలు : 6



## నగర వీధుల్లో...
# బాల్యం బరువెక్కుతోంది

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 29, (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం కార్పొరేషన్ వీధుల్లో కనిపించిన ఒక చిన్నారి దృశ్యం ఇది. ఎవరూ చూసినా మనసును కదిలించేలా చేసింది. చెప్పులు లేకుండా వేడి రహదారిపై వంగిన తలతో, భుజంపై సంచి వేసుకుని నడుస్తున్న ఆ చిన్నారి అడుగులు.. మనకు పేదరికం, ఆకలి, ప్రభుత్వ నిర్లక్ష్యంపై చెబుతున్న కబుర్లు. అసలు బాల్యం అంటే బడి గోడలు, ఆటల మైదానాలు, కలల పుస్తకాలు. కానీ ఈ చిన్నారికి మాత్రం.. బాధ్యతల భారం, ఆకలి ఆవేదనలే మిగిలింది. ఇలాంటి దృశ్యాలు మిగతా 2 లో...



## తల్లితండ్రుల త్యాగాలు
# వృధా కాకుండా విద్యనభ్యసించాలి...

- కష్టపడి చదివితే ఉన్నత స్థానాలు సాధ్యమే..
- డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఓరి యంటేషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

**కొత్తగూడెం (కలెక్టరేట్), ఆగస్టు 29 (ప్రజాజ్యోతి):** తల్లిదండ్రుల త్యాగాలు వృధా కాకుండా విద్యార్థులు చదువును అభ్యసించి,ఉన్నత స్థాయికి చేరాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శుక్రవారం డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన ఇంజనీరింగ్ మరియు బిఎస్సి మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.
కార్యక్రమంలో భాగంగా కాకతీయ యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ వి రామచంద్ర, జియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ మల్లికార్జున రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత విద్య కోసం ఇంటి నుండి దూరంగా పంపే సమయంలో అనేక అపోహలు కలిగి ఉంటారని, ఎలాంటి అపోహలు ఉంచకుండా విద్యార్థులను స్వేచ్ఛనిచ్చి చదువుకునేలా ప్రోత్సహించా లన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత స్థానాలు మంచి పేరు సంపాదించగలరని ఆయన సూచించారు. ప్రతి సంవత్సరం ఇంజనీరింగ్ డే ను మిగతా 2 లో...



## ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి.

- ఐటీడీఏ పీవో రాహుల్

**బూర్గంపహాడ్, ఆగస్టు 29 (ప్రజాజ్యోతి):** వాతావరణ మార్పుల వల్ల గ్రామాల్లో వైరల్ ఫీవర్ విజృంభిస్తున్నందున ఆశ్రమ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల ఆరోగ్యం పట్ల హెచ్ఎం, ఉపాధ్యాయులు, వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని ఐటీడీఏ పీవో రాహుల్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఉప్పుసాక బాలుర ఆశ్రమ పాఠశాలను, వడ్డెగూడెంలో జీపీఎస్ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఉప్పుసాక ఆశ్రమ పాఠశాలలో డార్మెటరీ, డైనింగ్హాల్, వంటగది, స్టోర్రూమ్ పరిశీలించి అనంతరం విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషిచేయాలని, ప్రతిరోజూ మెనూ ప్రకారం ఆహారం అందించాలని, స్టోర్రూమ్లో నాసిరకమైన ఆహార పదార్థాలు, మిగతా 2 లో...






## దండకారణ్యంలో
# కాల్పుల మోత...

- పోలీసులకి మావోయిస్టులకి మధ్య ఎదురు కాల్పులు
- భారీగా అధునాతన ఆయుధాలు స్వాధీనం
- స్వాధీనం చేసుకున్న వాటిలో ఎల్ ఏం జి ,ఏకే 47 ,డిటోనేటర్లు
- 300లకు పైగా సాహిత్యం ఇతర పేలుడు పదార్థాలు స్వాధీనం

2 లో..



# నేడు సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం కొత్త గూడెం ఏరియా కమిటీ ఎన్నికలు

**కొత్తగూడెం (సింగరేణి), ఆగస్టు 29 (ప్రజాజ్యోతి):** సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం కొత్తగూడెం ఏరియా కమిటీ ఎన్నికలు ఈ నెల 30న శనివారం సాయంత్రం మూడున్నర గంటలకు రుద్రంపూర్ లోని అంబేద్కర్ వైజ్ఞానిక కేంద్రంలో (ఆంధ్రా బ్యాంక్ సమీపంలో) జరగనున్నాయి. ఈ ఎన్నికలతో గిరిజన ఉద్యోగుల సమస్యలు, సంక్షేమం, ఉద్యోగ భద్రతల కోసం ఒక సమగ్ర వేదికగా ఏరియా కమిటీని తీర్చిదిద్దుతామని

2 లో..

## నగర వీధుల్లో బాల్యం బరువెక్కుతోంది

(మొదటి పేజీ తరువాయి...)

మన కార్పొరేషన్ పరిధిలో తరచూ కనిపిస్తూనే ఉన్నాయి. విటిపై స్పందించే అధికార యంత్రాంగం మాత్రం పెద్దగా స్పందించకపోవడమే ఇప్పుడు గమనార్హం. మెప్మా పేరుతో, బాల కార్మికుల నివారణ పథకంగా ప్రత్యేక వారోత్సవాలు అధికారులు ప్రతి యేటా నిర్వహిస్తారు. అందులో అప్పుడప్పుడు పెద్ద పెద్ద నినాదాలు వినిపిస్తాయి. కానీ ఆ పండుగ రోజులు గడిచిపోయాక మళ్లీ వీధుల్లో అదే చిన్నారులే భారమైన సంచులు మోస్తూ తిరుగుతారు. ఆ బాధని ఎవరు గుర్తించరు. అనునిత్యం పేదరికపు గొలుసులు ఈ బాల్యాన్ని బంధిస్తూనే ఉన్నాయి. బడి గంట మోగుతున్నా ఈ పిల్లల చెవులకు వినిపించడం లేదు. సంక్షేమ పథకాలు ప్రచారంతోనే ఆగిపోతున్నాయా..? లేక వీధి పిల్లల కళ్లలో వెలుగులు నిమ్పుతున్నయా.. ? అన్న ప్రశ్నలు ఈ దృశ్యం చూసిన ప్రతివాడినీ వెంటాడుతున్నాయి.

## ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి.

(మొదటి పేజీ తరువాయి...)

డేట్ ముగిసినవి ఉంటే వెంటనే వాటిని తీసేసి జీసీసీ నుంచి సరఫరా అయ్యే ప్రతి వస్తువు నాణ్యతగా ఉన్నవి తీసుకోవాలన్నారు. వైద్యసేవలు పొందుతున్న విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకుని వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్యసేవలు అందించాలన్నారు. అనంతరం ప్రైమరీ స్కూల్లో ఉద్దీపకం వర్క్ బుక్ –2 నిర్వహణ తీరును పరిశీలించి చదువులో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులను ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టారు. ఉద్దీపకానికి సంబంధించి బోర్డుపై పదాలు రాయించి పీవో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వడ్డెగూడెం జీపీఎస్ పాఠశాలను సందర్శించి ఉద్దీపకం వర్క్ బుక్ – 2 చిన్నారులకు ఏ విధంగా బోధిస్తున్నదీ పరిశీలించి చిన్నారులను ఉద్దీపకంలో అంశాలను ఏ విధంగా చదువుతున్నది చూసి పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు తప్పనిసరిగా ప్రతి అంశం ముందుగా చదువుకుని ఆ తర్వాత పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప్పుసాక హెచ్ఎం బీమ, వార్డెన్ శశికళ, ఎస్సీఆర్పీ మాధవి, వద్దుగూడెం జీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయులు బాలు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక క్షేత్రంలో ఎన్నికల కోలాహలం

- **ఏడు నుంచి 13 కు పెరిగిన డైరెక్టర్ల సంఖ్య**
- **తొలిసారి రిజర్వేషన్ల అమలు**
- **కేటీపీఎస్_ బి టి పి ఎస్ _ వై టి పి ఎస్_ క్రెడిట్ సొసైటీ ఎలక్షన్ వచ్చే నెల 10న**



**పాల్వంచ , ఆగస్టు 29, ప్రజాజ్యోతి:** పాల్వంచ కార్మిక క్షేత్రంలో ఎన్నికల కోలాహలం మొదలైంది, పాల్వంచ కేడిపిఎస్, మణుగూరు బి టి పి ఎస్, దామరచర్ల వైటీపీఎస్, ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ ఎన్నికల ప్రకటన ఎట్టకేలకు విడుదలైంది, సహకార సంగం గత పాలకవర్గం కాలపరిమితి వాస్తవానికి గత జనవరిలో ముగిసింది, అనివార్య కారణాలవల్ల పాలకవర్గం గడువు ఆరు నెలలు పొడిగించారు, పొడిగించిన కాల పరిమితి కూడా ఈనెల 14వ తేదీతో ముగిసింది, దీంతో ఎన్నికల నిర్వహణ అనివార్యమైంది, సెప్టెంబర్ 10న ఎన్నికలు జరగడంతో పాటు కౌంటింగ్ కూడా నిర్వహించనున్నారు, కేటీపీఎస్, బి టి పి ఎస్, వైటిపిఎస్, లలో పోలింగ్ కేంద్రాలు కూడా అధికారులు ఇప్పటికే ఏర్పాటు చేశారు, ఈ ఎన్నికలు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ సరళి జరుగుతుంది, పోలింగ్ ముగిసిన అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది, ఓట్ల లెక్కింపు మాత్రం మాత్రం కేటీపీఎస్ కాంప్లెక్స్ లోనే జరుగుతుంది, బి టి పి ఎస్, వైటీపీఎస్, లో పోలింగ్ ముగిసిన అనంతరం అక్కడ బ్యాలెట్ బాక్స్ లను అధికారులు కేటీపీఎస్ కు తరలిస్తారు, 3003 మంది సభ్యులు కలిగిన ఈ సహకార సంఘం ఎన్నికల్లో గెలుపొందేందుకు ఆశావాహులు అధిక సంఖ్యలో పోటీపడుతున్నారు, గతంలో ఏడు ఉన్న డైరెక్టర్ల సంఖ్యను ఈసారి 13కు పెంచారు, తొలిసారిగా ఈసారి రిజర్వేషన్లు కూడా అమలు చేయడం జరుగుతుంది, 13 డైరెక్టర్లలో 7 జనరల్ కు, 1 జనరల్ మహిళ , 2 బీసీలకు, 1 ఎస్సీ , 1 ఎస్సీ మహిళ , ఎస్టీలకు రిజర్వేషన్ చేశారు, ఈనెల 30, వచ్చేనెల 1, 2, తేదీలలో నామినేషన్లను స్వీకరిస్తారు, 3,4, న పరిశీలన, 5, ఉపసంహరణ ఉంటుంది, ఆ తర్వాత పోటీల్లో నిలబడే అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తారు, ఎన్నికల నిర్వహణ సహకార శాఖ అధికారుల నేతృత్వంలో ఏర్పాట్లు ముమ్మరముగా చేస్తున్నారు, పోటీల్లో నిలబడే అభ్యర్థులు ఇప్పటికే వాట్సఅప్ గ్రూపులలో ఆయా కర్మాగారాల కాంప్లెక్స్ లలో ఫ్లెక్సీల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు

# తల్లితండ్రుల త్యాగాలు వృధా కాకుండా విద్యనభ్యసించాలి

(మొదటి పేజీ తరువాయి...)

అందరం ఘనంగా నిర్వహిస్తామని మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల లేసి నివాళులు అర్పిస్తామన్నారు. కానీ ఆయన ఏ కళాశాల నుండి విద్యనభ్యసించారు, వారి యొక్క గురువులు గురించి ఎవరికీ తెలియదని ఆయన తెలిపారు.1861 లో కర్ణాటకలో జన్మించి ఇంజనీరింగ్ లో ప్రతిభ కనబరిచి దేశానికై గర్వకారణ మైన అనేక ప్రాజెక్టులను రూపొందించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆధునిక సదుపాయాలు లేనప్పటికీ ఆయన కృషి, నిబద్ధతే నేటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ తాను విద్యనభ్యసించేటప్పుడు ఎటువంటి సదుపాయాలు లేవని కిలోమీటర్ల దూరం నడిచి విద్యనభ్యసించే వాళ్ళమని కానీ మంచి ఉపాధ్యాయులు, ల్యాబ్ సౌకర్యాలు ఉండటం వల్ల నైపుణ్యం సాధించి ఈ స్థాయికి చేరుకోగలిగామని ఆయన అనుభవాలు విద్యార్థులతో పంచుకున్నారు. విద్యార్థులు పుస్తకాలతో పాటు ప్రత్యక్ష అనుభవాల ద్వారా నైపుణ్యాన్ని సాధించాలని ఆయన తెలిపారు. విద్యార్థులకు ఆయన తాను విద్యార్థి దశలో అనుభవాలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా యూనివర్సిటీలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక వసతి గృహాలు, ల్యాబ్లు ఆడిటోరియం మరియు క్రీడా మైదానం వంటి సదుపాయాలు కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ మన జిల్లాలో స్థాపించడానికి గల కారణం జిల్లాలో కోల్ మైన్స్, హెవీ వాటర్ ప్లాంట్, వేడి నీటి గుంతలు వంటి జియోలాజికల్ వైవిధ్యం ఉండటం వలన ఈ యూనివర్సిటీ ఇక్కడ స్థాపించడం జరిగిందని దీని ద్వారా విద్యార్థులు జియాలజీలో ప్రత్యక్షంగా అధ్యయనం చేయడం ద్వారా నైపుణ్యం సాధించవచ్చు అని తెలిపారు. విద్యను అభ్యసించిన అనంతరం దేశ విదేశాల్లో విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జగన్మోహన్ రాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాము, కళాశాల ప్రొఫెసర్లు, సిబ్బంది, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేడు సింగరేణి గిరిజన ఉద్యోగుల సంఘం కొత్తగూడెం ఏరియా కమిటీ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి...)

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోళ్ల రమేష్, జనరల్ సెక్రటరీ భూక్య కృష్ణమూర్తి స్పష్టం చేశారు.

**• ఐక్యతే బలమని..**

సింగరేణి బొగ్గు గనుల్లో గిరిజనులు శ్రమిస్తూనే ఎన్నో దశాబ్దాలుగా తమ హక్కుల కోసం పోరాడుతున్నారని నాయకులు గుర్తుచేశారు. ఉద్యోగ అవకాశాలు, ప్రమోషన్లు, వసతి గృహాలు, వైద్య సదుపాయాలు, పిల్లల విద్య వంటి అంశాలలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి కొత్తగూడెం ఏరియా కమిటీ బలమైన వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఎన్నికలలో గిరిజన ఉద్యోగులంతా భారీ సంఖ్యలో పాల్గొని సంఘానికి ఐక్యతను చాటాలని కోరారు.

**• ఎన్నికల పర్యవేక్షణకు..**

ఈ ఎన్నికల పర్యవేక్షణ కోసం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి పవన్ (కొత్తగూడెం ఏరియా), డిప్యూటీ జనరల్ సెక్రటరీ బొర్రా రాంబాబు (భూపాలపల్లి ఏరియా), సలహాదారు మాలోత్ మాణిక్ రామ్ హాజరుకానున్నారు. సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికలు జరుగుతుండటంతో ప్రక్రియ పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో సాగుతుందని పేర్కొన్నారు.

**• గిరిజన సమస్యలపై అజెండా..**

ఈ ఎన్నికల అనంతరం ఏరియా కమిటీ ప్రధానంగా గిరిజన సమస్యలపై దృష్టి పెట్టనుంది.

- **ఉద్యోగ భద్రత, పదోన్నతులు**
- **గిరిజన క్వార్టర్ల అభివృద్ధి**
- **విద్య, వైద్య సదుపాయాల విస్తరణ**
- **సంక్షేమ పథకాల అమలు**
- **గిరిజన హక్కుల సాధనలో చట్టపరమైన పోరాటం**

అన్న అంశాలపై సమగ్ర కార్యాచరణ చేపడతామని నాయకులు స్పష్టం చేశారు. "గిరిజన ఉద్యోగుల సమస్యలు కేవలం ఉద్యోగ సంబంధితవే కాదు, సమాజంలో గిరిజనుల స్థాయిని బలపర్చే అంశాలు కూడా" అని రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. సింగరేణి కార్మిక శక్తిలో గిరిజనుల పాత్ర అపూర్వమని, వారి శ్రమ గనులలో వెలిగే బొగ్గుకి వెన్నెముక అని గుర్తుచేశారు.

# దండకారణ్యంలో కాల్పుల మోత...

**చర్ల, ఆగష్టు 29: (ప్రజా జ్యోతి ):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ లో నారాయణపూర్ పోలీసులు నిర్వహించిన ఉమ్మడి నక్సల్ వ్యతిరేక "మాద్ బచావో" ఆపరేషన్ లో భద్రతా దళాలు విజయాన్ని సాధించాయి. నారాయణపూర్ జిల్లా పోలీస్ స్టేషన్ లోని కోహ్ కమెటా ప్రాంతంలోని అబుజ్ మద్ అడవి–పర్వతంలో మాడ్ డివిజన్ లో మావోయిస్టులతో భద్రతాదళాలు ఎదురుకాల్పులు జరిగాయి .ఈ ఎదురుకాల్పులులో సాయుధ సీనియర్ కేడర్ మావోయిస్టులు పెద్ద మొత్తంలో ఉంచిన పేలుడు పదార్థాలు రోజువారీకి ఉపయోగకరమైన వస్తువులను వదిలి పారిపోయారు. ఎల్ ఏం జి , ఏ కె –47 (త్రిచ్చి), ఐ యెన్ ఎస్ ఏ ఎస్ , ఎస్ ఎల్ ఆర్ , స్టెన్ గన్ వంటి అత్యాధునిక ఆయుధాలతో సహా 300 కి పైగా వస్తువులతో పాటు పెద్ద మొత్తంలో బి జి ఎల్ సెల్స్, డిటోనేటర్లు, కార్డెక్స్ ను బలగాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఎదురుకాల్పులు లో పెద్ద సంఖ్యలో నక్సలైట్లు గాయపడే అవకాశం ఉంది అని పోలీస్ లు భావిస్తున్నారు . జగదల్ పూర్ లోని బస్తర్ రేంజ్ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ సుందర్ రాజ్ పి. (ఐపిఎస్) నాయకత్వంలో నిర్వహిస్తున్న "మాడ్ బచావో" నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ లో, కాంకేర్ రేంజ్ డిప్యూటీ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ అమిత్ తుకారాం కాంబ్లే (ఐపిఎస్), నారాయణపూర్ పోలీస్ సూపరింటెండెంట్ శ్రీ రాబిన్సన్ గుడియా (ఐపిఎస్), అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ అక్షయ్ సబ్రా (ఐపిఎస్) మరియు నక్సల్ ఆప్స్ అదనపు సూపరింటెండెంట్ శ్రీ అజయ్ కుమార్ (ఐపిఎస్) మార్గదర్శకత్వంలో, డిఆర్ జి నారాయణపూర్, ఎస్ టిఎఫ్ , ఐటిబిపి సంయుక్త బృందం పెద్ద సంఖ్యలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలు నక్సల్ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకోవడం గమనార్హం. శ్రీ రాబిన్సన్ గుడియా (సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, నారాయణపూర్) సూచనల మేరకు, ఆదివారం డి ఆర్ జి నారాయణపూర్, ఎస్ టి ఎఫ్ , ఐ టి బి పీ (38వ బెటాలియన్, 41వ బెటాలియన్ , 45వ బెటాలియన్) ల సంయుక్త బృందం కసోద్, కుమురాడి, మడోరా, ఖోడ్పూర్ , గట్టకల్ లక్ష్యంగా ఉన్న ప్రాంతాల వైపు నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ కోసం ఆదివారం బయలుదేరింది కుతుల్ ఏరియా కమిటీలోని అడవి కొండలలో పోలీసులపై మావోయిస్టులు విచక్షణారహితంగా కాల్పులు జరిపగా ఆత్మరక్షణ కోసం భద్రతా సిబ్బంది కూడా వారిపై కాల్పులు జరుపగ భయపడి మావోయిస్టులు దట్టమైన అడవి, నదులు వాగులను ఉపయోగించుకుని పారిపోయారు. ఎన్ కౌంటర్ స్థలాన్ని శోధించినప్పుడు, డి ఆర్ జి ,ఎస్ టి ఎఫ్ సిబ్బంది కి మావోయిస్టులు పెద్ద మొత్తంలో దాచుకున్న ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలు నక్సల్ సాహిత్యాన్ని కనుగొన్నారు. అబుజ్మద్ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తూ పొంగిపొర్లుతున్న నదులు వాగులు ఉన్నప్పటికీ భద్రతా దళాలు 5 రోజుల పాటు ఈ నక్సల్ వ్యతిరేక పెట్రోలింగ్ శోధన ఆపరేషన్ ను నిర్వహించాయి. భద్రతా దళాల ఈ చర్య నక్సలైట్లకు తీవ్ర మానసిక వ్యూహాత్మక నష్టాన్ని కలిగించింది అలాగే మాడ్ లోని ఏ ప్రాంతంలోనూ మావోయిస్టులు సురక్షితంగా లేరని, వారికి స్పష్టమైన సందేశాన్ని పంపింది. నారాయణపూర్ ఎస్పీ శ్రీ రాబిన్సన్ గురియా (ఐ.పి.ఎస్.) అబుజ్మద్ లోని దుర్భరమైన అడవులు కష్టతరమైన భౌగోళిక పరిస్థితులలో నివసిస్తున్న ఆదివాసీలను నక్సలైట్ భావజాలం నుండి రక్షించడం వారిని మావోయిస్టు సూత్రాల ఆకర్షణ నుండి బయటకు తీసుకురావడం మా ప్రధాన లక్ష్యం అని తద్వారా ఈ ప్రాంతంలో అభివృద్ధి శాంతి నెలకొల్పబడుతుంది అని బయటి వ్యక్తుల తప్పుదారి పట్టించే చర్చలు భావజాలాన్ని విడిచిపెట్టి, ప్రభుత్వ లొంగుబాటు పునరావాస విధానాన్ని అవలంబించి జన జీవన స్రవంతిలో చేరాలని ఆయుధాలను నక్సలిజం భావజాలాన్ని పూర్తిగా త్యజించి వ్యతిరేకించాలని మేము అన్ని నక్సలైట్ సోదరులు సోదరీమణులకు విజ్ఞప్తి చేస్తున్నాము అని అన్నారు . ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ సుందర్ రాజ్ పి. (ఐపిఎస్) మాట్లాడుతూ 2025 సంవత్సరంలో, మావోయిస్టు సంస్థల అగ్ర నాయకత్వం భద్రతా దళాలచే తీవ్రంగా దెబ్బతింది అని నిషేధించబడిన చట్టవిరుద్ధమైన సి పీ ఐ మావోయిస్టు సంస్థకు ఇప్పుడు హింసను విడిచిపెట్టి లొంగిపోవడం తప్ప వేరే మార్గం లేదు అని మావోయిస్టు సంస్థ వెంటనే హింసాత్మక కార్యకలాపాలను విడిచిపెట్టి జన జీవన స్రవంతిలో చేరాలని విజ్ఞప్తి చేసారు .



# సస్పెండ్ అయిన చోటే మరలా పోస్టింగా..?

- ఎంక్వైరీ రిపోర్టు బహిర్గతం చేయాలి
- అధ్యాపకునిగా రాజకీయ నాయకుడా
- కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్న కొంతమంది అధికారులు
- ముఖ్యమంత్రి దృష్టికి, కోర్టుల దృష్టికి తీసుకు వెళ్తాము
- టీపీసీసీ ఎస్టీ సెల్ స్టేట్ కోఆర్డినేటర్, ఆదివాసీ నాయకులు తెల్లం నరేష్ డిమాండ్.



**భద్రాచలం టౌన్, ఆగస్టు 29(ప్రజా జ్యోతి):** భద్రాచలం పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాలలో గత నెల జరిగినటువంటి ప్రిన్సిపాల్ వార్డెన్ల సస్పెండ్ విషయంలో అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్టీ సెల్ కోఆర్డినేటర్, ఆదివాసీ నాయకులు తెల్లం నరేష్ అన్నారు. జులై 19వ తారీకు తారీఖున బాలికల అల్పాహారంలో పురుగులు వచ్చాయని వివిధ మాధ్యమాలలో రావడంతో గిరిజన గురుకులాల సమన్వయ అధికారి విచారణ చేసి పురుగులు వచ్చిన మాట వాస్తవమేనని నిర్ధారించుకొని పై అధికారులకు రిపోర్ట్ తెలియజేయడంతో అధికారులు వీరిద్దరిని సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. అగ్రవర్ణాలకు చెందిన అధికారులు కావడంతో చేసిన తప్పును కప్పిపుచ్చేందుకు రెండవసారి మరల విచారణ పేరుతో సస్పెండ్ అయిన వాళ్లకు అనుకూలంగా రిపోర్టు రాసిందనే అనుమానాలు బలంగా ఉన్నాయని ఆయన అన్నారు. తప్పు చేసి సస్పెండ్ అయిన వ్యక్తులు నెల రోజులలోనే మరల అదే ఉద్యోగంలో అదే స్థలంలో పోస్టింగ్ తెచ్చుకోవడం ఇదంతా చూస్తుంటే అగ్రవర్ణాలు పెత్తనం ఏ విధంగా చాలాయిస్తున్నారో అర్థమవుతుందన్నారు. కళాశాలలో గత కొంతకాలంగా అనేక ఆరోపణలు వస్తున్న అధికారులకు అవేమీ పట్టింపులకు లేకుండా కేవలం అగ్రకుల వ్యక్తిని కాపాడేందుకు అనేక ప్రయత్నాలు చేశారనే అనుమానాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. అసలు సస్పెండ్ అయిన స్థలంలోనే మరలా పోస్టింగ్ ఎలా ఇస్తారని అధికారులను ఆయన ప్రశ్నించారు. మొదటి విడత, రెండవ విడత జరిపిన ఎంక్వయిరీ రిపోర్ట్, ఎవరెవరిని విచారణ చేశారు అనే విచారణ నివేదిక బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే ఈ విషయంపై అధికారులు పునారాలోచన చేయకపోతే కోర్టులను కూడా ఆశ్రయిస్తామని, ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి చెడ్డ పేరు తీసుకువచ్చే విధంగా ప్రవర్తిస్తున్న ఎంక్వయిరీ చేసిన అధికారులపై ముఖ్యమంత్రికి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన రాజకీయ నాయకులకు కళాశాలలో అధ్యాపక స్థానంలో పనిచేస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు అర్థం కావడం లేదన్నారు. గురుకులాల సెక్రెటరీ బాలికల కళాశాలలో పురుష సిబ్బందిని తీసివేయాలని పదే పదే ఆదేశాలు జారీ చేసిన సంబంధిత ప్రిన్సిపల్, ఆర్ సి ఓ లు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియడం లేదన్నారు. కళాశాలలో ఉండి కళాశాలలోని లోటుపాట్లను బయటకు లీక్ చేస్తూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తూ దొంగే దొంగ అన్నట్లుగా వ్యవహరించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని తక్షణమే పురుష సిబ్బందిని తీయకపోతే అధికారులు ఇబ్బంది పడవలసిన పరిస్థితి నెలకొంటుందని ఆయన అన్నారు.

## పాల్వంచ నారాయణ పాఠశాలలో ఘనంగా వినాయకచవితి వేడుకలు

- నవరాత్రి ఉత్సవాల ద్వారా సమాజంలో ఐకమత్యం పెరుగుతుంది – డిజిఎం రమణా రెడ్డి



**పాల్వంచ (టౌన్) ఆగస్ట్ 29(ప్రజాజ్యోతి):** పాల్వంచ: స్థానిక నెహ్రూనగర్‌లోని నారాయణ పాఠశాలలో వినాయక చవితి వేడుకలు నారాయణ పాఠశాలల ఏజిఎం రాంకీ ఆధ్వర్యంలో ఘనంగా, సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపంలో శ్రీ సిద్ధి వినాయకుని విగ్రహాన్ని ప్రతిష్టించి, వ్రత సంకల్పం, కలశ పూజ, మహాగణపతి పూజ, ప్రాణ ప్రతిష్ట, షోడశోపచార పూజలను ఆలయాలనూ తలపించే విధంగా నిర్వహించారు. బ్యాండు మేళతాళాల మధ్య పూజా కార్యక్రమం శ్రద్ధా భక్తులతో జరిగింది. ఈ వేడుకలో పాల్గొన్న డీజీఎం రమణా రెడ్డి మాట్లాడుతూ, "నవరాత్రి ఉత్సవాల వంటి పండుగలు భక్తిని పెంపొందించడమే కాక, సమాజంలో శాంతి, ఐకమత్యానికి దారితీస్తాయి. రాగద్వేషాలు వీడి సాన్నిహిత్యం పెరుగుతుంది," అని అన్నారు. ఏజిఎం రాంకీ మాట్లాడుతూ, "ఈ వేడుకలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల ఉత్సాహం అభినందనీయం. వినాయకుని ఆశీస్సులతో పిల్లలు విద్యాభివృద్ధిలో ముందుకు పోవాలి," అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ క్రాంతి కుమార్, ప్రధానోపాధ్యాయులు పూరేటి నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్ పద్మ, ఉపాధ్యాయులు దీప్తి, కావ్య, అఖిల, శ్వేతా, ఏవొ వీర, పీఈటీ వినయ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు లేనిపాఠశాలలు గుర్తింపు

- కలెక్టర్ కు నివేదిక ఎంపీడీవో తాళ్లూరు రవి.



**జూలూరుపాడు, ఆగష్టు 29(ప్రజా జ్యోతి ):** జూలూరుపాడు మండల వ్యాప్తంగా ఉన్న 11 పాఠశాలలో మౌలిక సదుపాయాలపై ఎంపీడీవో తాళ్లూరు రవి మరియు మండల విద్యాధికారి జుంకీలాల్ కలసి ఆరా తీశారు. ప్రాథమిక పాఠశాలలు అయిన వినోబానగర్,బోజ్యతండా ,రేగళ్ళ తండా, వీర భద్రపురం, అనంతరం ,గంగారం తండా, మొద్దుల గూడెం ,పెద్దతండ, లైన్ తండా, జడల చింత బచ్చల కోయగూడెం. శంభుని గూడెం పాఠశాలలో తనిఖీ నిర్వహించారు. అయితే మూడు పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం లేకపోవడం 11 పాఠశాలల్లో టాయిలెట్స్ లేకపోవడానికి గుర్తించామని. మౌలిక సదుపాయాలు లేని పాఠశాలల నివేదికను కలెక్టర్ కు పంపిస్తున్నట్టు ఆయన చెప్పారు.

## మాజీ జెడ్పిటిసి ప్రభావతిని పరామర్శించిన సిపిఐఎం బృందం



**భద్రాచలం టౌన్, ఆగష్టు 29(ప్రజాజ్యోతి):** ఇటీవల ప్రమాదానికి గురైన భద్రాచలం మాజీ జడ్పిటిసి సిపిఐఎం సీనియర్ నాయకులు జివిఎస్ శంకర్రావు సతీమణి జి ప్రభావతిని సిపిఐ ఎం బృందం శుక్రవారం తన నివాస గృహంలో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఐఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభావతి త్వరగా కోలుకొని ప్రజా జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. ప్రభావతి శంకరరావు దంపతులు తమ వయసు ఆరోగ్యం తో సంబంధం లేకుండా నిరంతరం కుటుంబ వ్యాపార పనులతో పాటు అనేక రకాల సేవా కార్యక్రమాలలో ముందునటం అభినందనీయమని అదే సందర్భంలో తమ ఆరోగ్య విషయంలోను సైతం తగిన జాగ్రత్త తీసుకోవాలని కోరారు. ప్రభావతి భద్రాచలం జడ్పిటిసిగా పనిచేసిన కాలంలో భద్రాచలం పట్టణంతో పాటు మండలంలో సమగ్ర అభివృద్ధి చేశారని ఈ సందర్భంగా మచ్చ గుర్తు చేశారు. పార్టీ శ్రేణుల కుటుంబాలకు ఎప్పుడూ తోడుగా ఉంటుందని మచ్చ హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రం శెట్టి వెంకట రామారావు,పారిల్లి సంతోష్ కుమార్, ములుగు జిల్లా నాయకులు కొప్పుల రఘుపతి, పట్టణ కమిటీ సభ్యులు సంద్ర భూపేంద్ర, మహిళా సంఘం నాయకులు యర్రంశెట్టి భవాని తదితరులు ప్రభావతిని పరామర్శించారు.

## చిన్నమిడిసిలేరులో వైద్య శిబిరం



**చర్ల, ఆగష్టు 29(ప్రజా జ్యోతి ):** చర్ల మండలం లో శుక్రవారం సత్యనారాయణ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న చిన్నమిసిలేరు గ్రామంలో డాక్టర్ దివ్య నయన ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరం లో జ్వరం తో బాధపడుతున్న ఆరుగురికి ఆర్ డి టి మలేరియా పరీక్షలు చెయ్యడం జరిగింది.ఈ పరీక్షలలో వారికి మలేరియా లేదు అని రావరంతో వారికి వచ్చింది మాములు జ్వరంగా నిర్ధారించి మందులు ఇవ్వడం జరిగింది. ఈ ఆరోగ్య శిబిరంలో సాధారణ వ్యాధులకు మందులు ఇవ్వడం జరిగింది .ఈ సందర్భగా డాక్టర్ దివ్య నయన మాట్లాడుతూ జ్వరాలు వచ్చిన వెంటనే ఆశ్రద్ధ చెయ్యకుండా పి హెచ్ సి రాగలరు అని పి హెచ్ సి లో అన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయి అని చెప్పడం జరిగింది. గ్రామంలో రాపిడ్ ఫీవర్ సర్వే చేయించడం జరిగింది.డ్రై డే కార్యక్రమాలు చెయ్యడం జరిగిందిఅలాగే వర్షాకాలం కాబట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని. నీళ్లు నిల్వలేకుండా చూసుకోవలనిఎల్లపుడు పరిశుభ్రమైన నీటిని తీసుకోవాలని సూచనలు చెప్పటం జరిగింది .ఈ కార్యక్రమంలోడాక్టర్ దివ్య నయన మెడికల్ ఆఫీసర్,బాబురావు హెచ్ ఈ ఓ,వీరమ్మ ఏ ఎన్ ఎమ్,సుబ్బారావు హెల్త్ అసిస్టెంట్ ,నాగలక్ష్మి ఆశా కార్యకర్త,తదితరులు పాల్గోనడం జరిగింది.

## ఓటర్ జాబితాను పరిశీలించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు

**జూలూరుపాడు, ఆగష్టు 29(ప్రజా జ్యోతి):** త్వరలో జరగబోయే స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల సందర్భంగా సవరించిన ముస్తాయిదా ఓటర్ జాబితాను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శాసనమండలి సభ్యులు తాత మధుసూదన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు ఈ రోజు జూలూరుపాడు మండల కేంద్రంలోని మాచినేనిపేటతండా గ్రామపంచాయతీలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన ఓటర్ జాబితాను పరిశీలించడం జరిగింది. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలో ఓటర్ జాబితాలో తమ పేర్లతో పాటు కుటుంబ సభ్యుల పేర్లు సరి చేసుకోవాలని ఓటర్ల జాబితాలో అవకతవకలు,పొరపాట్లు లేకుండా చూడాలని అధికారులను కోరారు.



## జీవ వైవిధ్య అభివృద్ధి కార్యక్రమం

**చర్ల, ఆగష్టు 29(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో శుక్రవారం కలివేరు గ్రామంలో ఐటీసీ ,యమ్ ఎస్ కె వారి సహకారం తో మైరాడ స్వచ్ఛంద సంస్థ వారు ఆర్ కొత్త గూడెం గ్రామం, సత్యనారాయణ పురం, కలివేరు, ఉప్పరిగూడెం, పంచాయతీలకు బయోడై వర్సిటీ మొక్కలు పంపిణీ చేయడం జరిగింది .అలాగే ఈ మొక్కల వలన జీవవైవిద్య అభివృద్ధి జరుగుతుందని మొక్కలు పెంచడం వలన కాలుష్యం నుంచి వాతావరణాన్ని కాపాడుకోవచ్చని అన్నారు . ఈ మొక్కల పెంపకం ద్వారా జీవరాశులకు వాటి నివాసాలుగా ఉపయోగపడతాయని అన్నారు గ్రామాలలో మొక్కలు పెంచడం వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని అన్నారు .ఈ సందర్భగా కలివేరు గ్రామ సెక్రెటరీ ఇర్ప శ్రీరామ్ అలాగే మైరాడ సోషల్ మొబిలైజర్ వి నవీన్ రైతులకు మొక్కలు పెంచడం వల్ల ఎటువంటి హానికరం ఉండదని ప్రాణవాయువు ఉంటుందని నేటి తరాలకు మొక్కలు చాలా అవసరం అని సమావేశంలో తెలియపరిచారు .ఈ సమావేశాల్లో తుర్రం బాలకృష్ణ,కల్లూరి నరసింహారావు, నాని పాలి బాలకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.



## పారిశ్రామిక వాడలో మట్టి రోడ్లు లేకుండా చేస్తా

- రూ. 70లక్షలతో సీసీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం



**బూర్గంపహాడ్, ఆగస్టు 29 (ప్రజా జ్యోతి ):** పారిశ్రామిక వాడ సారపాకలో మట్టి రోడ్లు అనేవి లేకుండా చేస్తానని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సారపాకలోని భాస్కరనగర్, గాంధీనగర్, ఒడియా క్యాంప్, మహేంద్రకాలనీ, రాజీవ్నగర్ కాలనీ, బొగ్గుసూర ప్రాంతాల్లో రూ. 70లక్షలతో నిర్మించిన 12 సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 24 నెలల్లో సారపాకలో రూ.6కోట్లతో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టామని, మరోసారి రూ.2.90 కోట్లతో సీసీ రోడ్లకు ప్రొసీడింగ్స్ వచ్చాయని మట్టి రోడ్డు అనేది లేకుండా పారిశ్రామిక వాడ సారపాకను అభివృద్ధి చేస్తానని చెప్పారు. అనంతరం లబ్దిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, తహశీల్దార్ కేఆర్కే ప్రసాద్, పంచాయతీరాజ్ డీఈ పొదెం వెంకటేశ్వర్లు, ఏఈ చారి, పంచాయతీ ఈవో కంది మహేష్, మాజీ సొసైటీ అధ్యక్షుడు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, నాయకులు బాదం రమేష్రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మహిమూద్ఖాన్, ఇంగువ రమేష్, బర్ల నాగమణి, పూలపెల్లి సుధాకర్రెడ్డి, దాసరి సాంబ తదితరులు పాల్గొన్నారు.

## విగ్నేశ్వరుడి ఆశీస్సులుంటే అన్ని విఘ్నాలు తొలగిపోతాయి : బండారి



**కొత్తగూడెం, ఆగస్టు 29 (ప్రజాజ్యోతి ):** ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని విగ్నేశ్వర స్వామిని వేడుకున్నట్లు మాజీ కౌన్సిలర్ రుక్మాంగధర్ బండారి తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి వెనుక ఏర్పాటు చేసిన గణపతి మండపాన్ని దర్శించుకున్నరు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సనాతన సంప్రదాయాలను, పండుగ విశిష్టతను పరీక్షించాలని ప్రజలను కోరారు. విగ్నేశ్వరుడి ఆశీస్సులుంటే అన్ని విఘ్నాలు తొలగిపోతాయని అన్నారు. తెలంగాణ ప్రజలను వరద బీభత్సం నుండి కాపాడాలని ఆ ఘననాధుని వేడుకున్నాన్నట్లు తెలిపారు. వినాయక పూజలు ఘనంగా జరుపుతున్న కమిటీ వారిని అభినందించారు. ఆనంతరం పూజలో పాల్గొని స్వామివారి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విగ్నేశ్వర భక్త మండలి సభ్యులు రాసకట్ల శ్రీను, రామకృష్ణ, సాయి, సన్నీ, శ్రీనివాసు, భక్తులు పాల్గొన్నారు.

## రూ. 9 లక్షలతో గణనాధునికి అలంకరణ



**ఇల్లందు, ఆగస్ట్ 29, ప్రజాజ్యోతి:** మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులోని గణేష్ మండపంలో శుక్రవారం లక్ష్మి అలంకరణలో భాగంగా శిలగాని రాజా వినోద ఆధ్వర్యంలో ఆ బస్తీ వాసులు రూ. 9 లక్షలను అలంకరించారు. పట్టణ ప్రజలు, తమ వార్డు ప్రజలందరూ సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండేలా చూడాలని ఆ గణనాధుడిని వేడుకున్నారు.

# విజేతలకు బహుమతులు ప్రధానం

- అన్ని విభాగాల్లో జూలూరుపాడు విద్యార్థిని విద్యార్థులకే కైవసం



**జూలూరుపాడు, ఆగష్టు 29(ప్రజా జ్యోతి ):** జూలూరుపాడు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడల్లో విజేతలకు శుక్రవారం బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో పాపకొల్లు జూలూరుపాడు పడమటి నర్సాపురం కాకర్ల కు చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో పాటు కేజీబీవీ మరియు ఏజీహెచ్ఎస్ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థినిలు కూడా పాల్గొన్నారు. శుక్రవారం పోటీలు ముగియడంతో విజేతలకు బహుమతులను అందజేశారు కాబట్టి వాలీబాల్ విభాగాలలో జూలూరుపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎక్కువ ఆట తీరను ప్రదర్శించి బహుమతులను కైవసం చేసుకున్నారు తర్వాత స్థానాల్లో KGBVతో పాటు AGHSపడమటి నరసాపురం విద్యార్థినిలు రెండవ స్థానంలో నిలిచారు .ఇక మూడు నాలుగు స్థానాల్లో పాపకొల్లు కాకర్లకు చెందిన పాఠశాల విద్యార్థులు బహుమతులను కైవసం చేసుకున్నారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్చంద్ జన్మదిన సందర్భంగా హాకీ క్రీడల్లో వారు సాధించిన పథకాలను గుర్తు చేసుకున్నారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు ఆటపాటల్లో విజయాలు సాధించాలని ఆటలు కూడా ఆరోగ్యానికి దోహదపడతాయని అన్నారు ఈ సందర్భంగా విజేతలను అభినందించారు విజేతలకు బహుమతులను అందించిన వ్యాపారవేత్త మంగమూడి నాగేశ్వరరావు ను అభినందించారు కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ రసయ్య,మీరా సాహెబ్,రామ్ శెట్టి శ్రీనివాసరావు, నిమ్మగడ్డ ఉమ,సూరపనేని శాంతకుమారి, గురుమూర్తి, రామనాథన్,వెంకటేశ్వర్లు, జివిఆర్ ప్రసాద్ సర్దార్ విబి పటేల్. ఉమామహేశ్వరి భానోత్ సునీత శకుంతల, నాగ రమేష్ ఉదయ సేతు, ఉపేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇరవెండిలో పాఠశాల విద్యార్థుల అవస్థలు

- బస్టాప్ వద్ద ఉంటే గుంతలతో యూనిఫాం బురదమయమవుతుందని ఆవేదన



**బూర్గంపహాడ్, ఆగస్టు 29 (ప్రజా జ్యోతి ):** మండల పరిధిలోని ఇరవెండి గ్రామంలో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రతినిత్యం ఉదయం గ్రామంలో బస్ సెల్టర్ వద్ద పాఠశాలకు వెళ్లేందుకు యూనిఫాం వేసుకుని వెళుతున్నామని, కాగా ఆ ప్రాంతంలో గుంతల్లో నీరు నిలిచి ఉండటంతో వచ్చి పోయే వాహనాలతో మా యూనిఫాం బురదమయమవుతుందని ఆరోపిస్తున్నారు. బస్సు కోసం ఎదురుచూస్తున్న సమయంలో స్టాప్ ఉన్న ప్రదేశంలో ఉన్న తమపై వచ్చి పోయే వాహనాలు గుంతల్లో నుంచి బురదచిమ్మి వెళుతున్నాయని, దీంతో పాఠశాలకు సమయానికి వెళ్లలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు గుంతలతో ఉన్న రహదారికి మరమ్మతులు చేపట్టి విద్యార్థుల ఇబ్బందిని తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## భద్రాచలంలో వినాయక చవితి వేడుకలు

- ద్వారకా నగర్ కాలనీలో కుంకుమ పూజలు





**భద్రాచలం, ఆగస్ట్ 29,ప్రజాజ్యోతి :** వినాయక చవితి వేడుకలు భద్రాచలం పట్టణంలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ పండుగను పురస్కరించుకుని ద్వారకా నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మూడో రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ వేడుకల్లో భాగంగా, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు వినాయక మండపానికి వచ్చి ప్రత్యేక పూజలు చేసి, తమ భక్తిని చాటుకున్నారు. ఈ పూజల అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేశా రు.ఈ వేడుకల సందర్భంగా వినాయకుడి విగ్రహానికి ప్రత్యేక అలంకరణలు, వివిధ రకాల నైవేద్యాలు సమర్పించారు. భక్తులు తమ ఇలవేల్పు అయిన వినాయకుడిని దర్శించుకుని, భక్తి భావంతో ఆరాధించారు. ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా ద్వారకా నగర్ కాలనీలో గణేష్ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

## ముసాయిదా ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి :కలెక్టర్ జితేష్ వి. పాటిల్.




**కొత్తగూడెం (కలెక్టరేట్), ఆగస్టు 29, (ప్రజాజ్యోతి ):** రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల దృశ్య ముసాయిదా ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ తో కలిసి కలెక్టర్ ఓటరు జాబితా తయారీ, ప్రచురణ, పోలింగ్ స్టేషన్ల వద్ద జాబితా ప్రచురణ తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీల్లో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 471 పంచాయతీలలో మొత్తం 6,69,024 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 3,25,033, మహిళలు 3,43,967 మంది కాగా 24 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. 4168 వార్డులకు గాను 4242 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు మండల స్థాయిలో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఆగస్టు 30 సాయంత్రం లోపు ఓటర్ల జాబితా పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా మండల కార్యాలయాల్లో తెలియజేయాలని ఆయన తెలిపారు. అభ్యంతరాల సవరణ అనంతరం సెప్టెంబర్ రెండున తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇది ఓటర్ల జాబితా వార్డుల ప్రకారం ప్రదర్శించబడతాయని ఆయన తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలింగ్ కేంద్రాలలో కల్పించవలసిన మౌలిక వసతులు లేదా సమస్యల పరిష్కారాలను తమ దృష్టికి తేవడం ద్వారా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ లక్ష్మణ్, బాల ప్రసాద్, భారతీయ రాష్ట్రసమితి రేగా కాంతారావు, సిపిఐ ఎస్ శ్రీనివాస్, సిపిఎం ఏ సత్యనారాయణ, భారతీయ జనతా పార్టీ నరేందర్, నోములబాలు, ఆమ్ ఆద్మీ పార్టీ ఏ రాంబాబు మరియు తదితరులు పాల్గొన్నారు.

# శ్వాసకోశ వ్యాధులతో మృత్యువాత పడుతున్న ప్రజలు

- భయభ్రాంతులకు గురవుతున్న రాజుపేట గ్రామస్తులు
- సింగరేణి అధికారుల నిర్లక్ష్యానికి బలైపోతున్న గ్రామ ప్రజలు
- సిపిఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య.



**మణుగూరు, ఆగష్టు 29, (ప్రజా జ్యోతి) :** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేట గ్రామ ప్రజలు శ్వాస కోస వ్యాధులతో, ఇతర భయంకరమైన జబ్బులతో ప్రజలు మృత్యువాత పడుతున్నారని, సింగరేణి అధికారుల నిర్లక్ష్యానికి బలైపోతున్నారని సిపిఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య మండిపడ్డారు. శుక్రవారం సిపిఐఎం మణుగూరు మండల కమిటీ ఆధ్వర్యంలో రాజుపేట గ్రామాన్ని సందర్శించి వీధి వీధినా తిరిగి అక్కడ సమస్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని బాధిత ప్రజలతో మాట్లాడారు. పీకే వన్ సింగరేణి బొగ్గు గని ప్రారంభించి గత 50 సంవత్సరాలు అవుతుందని అదే ప్రాంతంలో సింగరేణి బొగ్గు గని ప్రారంభానికి ముందే ఆ ప్రాంతంలో రాజుపేట గ్రామం 20 సంవత్సరాల క్రితమే గ్రామ నిర్మాణం జరిగి ఉందని ఆయన తెలిపారు. నాటి నుండి నేటి వరకు సింగరేణి బొగ్గు గనుల వలన ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల కాలంలో మల్లెపల్లి ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ప్రారంభించి అందులో బొగ్గు బ్లాస్టింగ్ లు చేయడం వలన ఆ గ్రామంలోని సుమారు 120 ఇండ్లు పూర్తి స్థాయిలో బ్లాస్టింగ్లకు గురై ఇండ్లు బీటలు బారుతున్నాయని అన్నారు. కొన్ని ఇండ్లు గోడలు కూలిపోయిన దుస్థితిలో ఉన్నాయని అనేక ఇల్లు శిధిలావస్థకు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లెపల్లి ఓపెన్ కాస్ట్ నుండి బొగ్గు లారీలు అతివేగంతో నడపడం వలన అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, లారీల అతివేగం వలన గ్రామ ప్రధాన రహదారిలో అనేక మంది మృత్యువాత పడ్డారని ఆయన మండిపడ్డారు. బొగ్గు లారీల రవాణా వలన దుమ్ము ధూళి ఇళ్లపై పడుతుందని దానివలన ఇండ్లలో ఉన్న వివిధ రకాల పండ్ల చెట్లపై దుమ్ము,ధూళి చేరడంతో పర్యావరణం దెబ్బతింటుందని దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో కనీస సౌకర్యాలు కూడా లేనటువంటి పరిస్థితి ఉందని అన్నారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీ కాలువలు లేవని కనీసం వీధి దీపాలు కూడా లేకపోవడంతో గ్రామం మొత్తం అంధకారంతో మగ్గుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు దరిచేరడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో అనేక సంవత్సరాల నుండి మున్సిపాలిటీ అధికారులు ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారే తప్ప గ్రామ అభివృద్ధికి తోడ్పడటం లేదని ఆరోపించారు. కొంతమందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయితే ఇక్కడ ఇళ్ల నిర్మాణం చేయవద్దని సింగరేణి అధికారులు అడ్డుకోవడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. ప్రమాదవశాత్తు గ్రామ ప్రజలకు ఏది జరిగినా సింగరేణి యాజమాన్యమే బాధ్యత వహించాలని ఆయన అన్నారు. రాజుపేట గ్రామాన్ని నిర్వాసిత ప్రాంతంగా గుర్తించి, గ్రామ ప్రజలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. రాజుపేట గ్రామ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేని పక్షంలో సిపిఐఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, బొల్లం రాజు, హేమంతరావు, సారిక మరియు గ్రామ ప్రజలు బాహుసింగ్, వెంకటేశ్వర్లు, నరసింహారావు, నారాయణ, రాజ కుమారి, చైతన్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల కోసం ఎక్కడైన, ఎంత దూరమైన కొల్లిఫౌండేషన్ సేవలు





**పాల్వంచ (రూరల్), ఆగష్టు 29,ప్రజా జ్యోతి:** పాల్వంచ మండలం బంద్రుగొండ పంచాయితీ పరిధిలోని కోయగట్టు పాఠశాల విద్యార్థులకు బ్యాగులు,నోటు పుస్తకాలు,స్టేషనరి పంపిణి చేసిన కొల్లి కల్పనా చౌదరి.గిరిజన ప్రాంతాలలోని పేద విద్యార్థులకు విద్యను అందించాలని పాల్వంచ మండలం కోయగట్టు గ్రామంలో ఒక నెల క్రితం జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా ప్రారంభించిన ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసించడానికి గుర్తించిన 45 మంది నిరుపేద విద్యార్థులకు అండగ మేమున్నామంటు ముందుకు వచ్చారు.కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కల్పనా చౌదరి. కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ సహకారంతో కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోయగట్టు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, డ్రాయింగ్ బుక్స్,బ్యాగులు,నోటు పుస్తకాలతో పాటుగా స్టేషనరి ని అందించారు.ఈ సందర్బంగా కల్పనా చౌదరి మాట్లాడుతు కొల్లి ఫౌండేషన్ విద్యాభివృద్ధి పెంచేందుకు ఎల్లపుడు ముందుంటుందన్నారు. చదువుతోనే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని,చదువుకుంటే ఏ రంగంలోనైనా రాణించగలరని ప్రతి ఒక్కరు విద్యను ప్రోత్సహించాలన్నారు.తల్లి తండ్రుల ఆశలు, ఆశయాలకు తగ్గట్లుగా పిల్లలు చదువుకోవాలని సూచించిన ఆమె పిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరితేనే చదువుకు సార్ధకత లభిస్తుందన్నారు.రాబోయే రోజుల్లో కూడ ప్రభుత్వంతో కలిసి విద్యార్థుల ప్రయోజనం కోసం పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, భవిష్యత్ లో కోయగట్టు పాఠశాల పక్కా భవన నిర్మాణం కోసం సహాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు.ఎంపీపీస్ కోయగట్టు ప్రధానోపాధ్యయులు ఎన్.బిక్షం మాట్లాడుతు పాఠశాలలో పిల్లల పరిస్థితి గురించి తెలిపిన వెంటనే స్పందించి మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన కోయగట్టు గ్రామానికి సరైన రహదారి లేకపోయిన వచ్చి విద్యార్థులకు అండగా నిలిచిన కొల్లి ఫౌండేషన్ ఫౌండర్ కల్పనా చౌదరి,కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ గూడూరు సత్యనారాయణ,కో–ఆర్డినేటర్ రూప్లా నాయక్ లకు విద్యార్థులు, వారి తల్లితండ్రుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గ్రామస్తులు కొల్లి కల్పనా చౌదరి ని శాలువాతో సత్కరించి సన్మానించారు.

# వేగంగా పెరుగుతున్న గోదావరి

- మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో గోదారి ప్రవాహం
- ఎగువ ప్రాంతాల వరదతో భద్రాచలం వద్ద గోదారి ఉధృతి





**భద్రాచలం, ఆగస్టు 29,ప్రజాజ్యోతి :** భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. 28న రాత్రి 11 గంటలకు 37.10 అడుగులతో నిలకడగా ఉన్న గోదావరి శుక్రవారం ఉదయం 6 గంటలకు 35.20 అడుగులు, మధ్యాహ్నం 1 గంటలకు 38.20, సాయంత్రం 6 గంటలకు 42.20 అడుగులకు చేరుకుని మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి వరద చేరి వేగంగా ప్రవాహం కొనసాగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎగువన కురిసిన వర్షాలకు వరదనీరు గోదావరిలోకి వచ్చి చేరడంతో క్రమక్రమంగా వరద ఉధృతి పెరుగుతుంది. రాత్రి సమయానికి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని సీడబ్ల్యుసీ, ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. జిల్లా యంత్రాంగం గోదావరి వరదల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేలా అప్రమత్తం చేసింది. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, ఏఎస్పీ విక్రాంత్కుమార్ సింగ్ వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ జిల్లా అధికారులకు సమాచారమిస్తూ అధికారులకు పలు సూచనలు చేస్తున్నారు.

# పెద్దమ్మతల్లికి ఘనంగా పంచామృతాభిషేకము



**పాల్వంచ(రూరల్),ఆగష్టు 29,ప్రజా జ్యోతి:** మండలం,కేశవాపురం–జగన్నాధపురం గ్రామంలో వెలసియున్న కనక దుర్గ దేవస్థానము(పెద్దమ్మగుడి)నందు అమ్మవారికి పంచామృతములతో వైభవముగా అభిషేకము నిర్వహించబడినది. ముందుగా మేళతాళాలతో దేవస్థాన అర్చకులు,భక్తులు జన్మస్థలం వద్ద ఉన్న అమ్మవారికి పంచామృతాలు, పసుపు, కుంకుమ,గాజులు,హారతి సమర్పించి అనంతరం తదితర పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు పూజలలో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించినారు.ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు,ధర్మకర్తలు చెవుగాని పాపారావు,సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# గణేష్ మండపంలో అన్నదానం

- అన్నదానంలో పాల్గొన్న పొదెం వీరయ్య



**భద్రాచలం, ఆగస్టు 29, ప్రజాజ్యోతి :** పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన గణపతి పూజా మండపం వద్ద ఆలయకమిటీ నిర్వాహకుల ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర అటవీ కార్పోరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య శుక్రవారం హాజరై తొలుత గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి భక్తులతో కలిసి అన్నదానంలో పాల్గొన్నారు. అనంతరం పొదెం వీరయ్యను శాలువాతో కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# శ్రీ వరసిద్ది వినాయక చవితి మండపం వద్ద అన్నదానం





**ఆళ్లపల్లి. ఆగస్టు29. ప్రజా జ్యోతి:** శ్రీ వరసిద్ధి వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మండల పరిధిలోని మర్కోడు గ్రామపంచాయతీ జిన్నెలగూడెం గ్రామంలో ఏర్పాటుచేసిన గణేశుని మండపం వద్ద భక్తులు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. తదనంతరం విగ్రహ నిర్వహణ ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మూడో రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వేమూరి రవికుమార్–మమత దంపతుల ఇరువురిని విగ్రహ దాతలను గ్రామ పెద్దలు వేమూరి రాంబాబు, చిట్టిమల్ల బాబు, వేమూరి సత్యం కమిటీ సభ్యుల ప్రోత్సాహంతో ఘనంగా వారిని సన్మానించారు. కమిటీ సభ్యులు గ్రామ పెద్దలను చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సత్యం, వెంకట్రావు, సుధాకర్, రవి, హరిబాబు, నరసింహారావు, బిక్షం, తిరుపతి, వెంకన్న, వసంతరావు, విజయ్, నిఖిల్ నవీన్, సాయి, అరవింద్,అఖిల్, దిలీప్,యశ్వంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మల శ్రీయాదగిరి క్షేత్ర మహత్యం గ్రంథావిష్కరణ



భద్రాచలం, ఆగస్టు 29,ప్రజాజ్యోతి :శ్రీ భద్రాచలం దేవస్థానం శ్రీరామాయణ పారాయణదారు ఎన్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు రచించిన బొమ్మల శ్రీయాదగిరి క్షేత్ర మహత్యం గ్రంథావిష్కరణ శుక్రవారం దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ చేతులమీదుగా జరిగింది. గ్రంథ రచయితను, చిత్రకారుడు ఎన్.వెంకటరమణను అందరూ ప్రశించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ఆలయ ఈవో, దేవాదాయశాఖ కమీషనర్ ఎన్.వెంకట్రావు, భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ప్రధాన అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై బిజెపి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ




దమ్మపేట,ఆగష్టు 29 (ప్రజాజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షులు రామచంద్రరావు,జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి పిలుపు మేరకు,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,దమ్మపేటలో బీజేపీ మండల అధ్యక్షులు పల్లపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిరసన ర్యాలీ చేయడం జరిగింది,ఈ సందర్భముగా బీజేపీ నాయకులు మాట్లాతూ కాంగ్రెస్ గవర్నమెంట్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు వెంటనే అమలు చేయాలని , దమ్మపేట మండలంలోని నెమలిపేట భారీ వర్షాల వల్ల ముంపుకు గురైన వరద బాధితుల కుటుంబాలకు వెంటనే అధికారులు స్పందించి న్యాయం చేయాలని, ముంపుకు గురైన ఇళ్ళకు పది వేల రూపాయల చొప్పున తక్షణ సహాయం అందించాలని ,ఊరిలో ఉన్న ప్రతి కుటుంబానికి ఒక ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని దమ్మపేట మండల తహశీల్దారు కార్యాలయం ,మండల పరిషత్ కార్యాలయాలలో సంబందిత అధికారులకు వినతి పత్రాలు అందజేసి నిరసన తెలియజేశారు,ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణకవచాలంకరణ



భద్రాచలం, ఆగస్టు 29,ప్రజాజ్యోతి :భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.5కోట్లతో తయారుచేయించి సమర్పించిన సర్వాంగ స్వర్ణ కవచాలను అర్చకులు ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, నిత్యహోమాలు, నిత్యబలి హరణం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ మూర్తులకు బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు.కల్యాణంలో పాల్గొన్న జంటలకు శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ఖమ్మం, కొత్తగూడెం జిల్లా కలెక్టర్లతో మాట్లాడిన మంత్రి తుమ్మల

- **గోదావరి వరద , మున్నేరు పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం , ఖమ్మం కలెక్టర్ లకు మంత్రి ఆదేశం**

పాల్వంచ,ఆగస్టు 29, ప్రజా జ్యోతి:భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో పరివాహక ప్రాంతాలలో గల లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని, రైతులు పశువులు కాపరులు వాగులు వంకలు దాటకుండా కట్టడి చేయాలని, అందుకోసం పోలీస్ సిబ్బంది సేవలు తీసుకోవాలని కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ను మంత్రి తుమ్మల ఆదేశించారు. తాలిపేరు ,కిన్నెరసాని ప్రాజెక్టు పరివాహక ప్రాంతాలలో గల లోతట్టు గ్రామాల్లో వరద నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని, వరదలతో పూర్తిగా నిండిన చెరువుల కట్టలు తెగే ప్రమాదం ఉన్నందున నీటి పారుదల శాఖ అధికారులు సిబ్బంది చెరువుల వద్ద పర్యవేక్షణగా ఉండాలని మంత్రి తుమ్మల సంబంధిత అధికారులను ఆదేశించారు, ఎగువ నుంచి భారీగా గోదావరి వరద ఉధృతి ఉన్నందున భద్రాచలం వద్ద గల కరకట్ట స్లూయిస్ లీకేజ్ కాకుండా, పట్టణంలో వర్షపు నీరు కరకట్ట వద్ద నిలవకుండా ఎత్తి పోసే మోటార్లను సిద్ధంగా ఉంచాలని, అత్యవసర వైద్య సేవలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కు మంత్రి తుమ్మల దిశా నిర్దేశం చేశారు.అదేవిధంగాఖమ్మం వద్ద మున్నేరు కు వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని,జిల్లా వ్యాప్తంగా వరదల పట్ల జిల్లా యంత్రాంగం సహాయ చర్యలకు సన్నదంగా ఉండాలని కలెక్టర్ అనుదీఫ్ ను మంత్రి తుమ్మల ఆదేశించారు.కొణిజర్ల మండలంలో వాగులు ఉధృతంగా ప్రవహించే మార్గాల్లో వాహనాలను నిలిపివేయాలని , కట్టలేరు ఉప్పొంగి పలు చోట్ల రహదారులు పై వరద నీరు పోటెత్తడంతో ఆ రహదారుల్లో ప్రయాణాలు నిలిపివేయాలని సూచించారు.జిల్లాలో పాలేరు మున్నేరు , వైరా కట్టలేరు ,ఉప నదులు తో పాటు వాగులు పొంగి ప్రవహిస్తున్నందున ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా అప్రమత్తంగా ఉండాలని, అందుకోసం జిల్లా యంత్రాంగం సన్నదంగా ఉండాలని కలెక్టర్ అనుదీఫ్ ను మంత్రి తుమ్మల ఆదేశించారు.వాగులు చెరువుల్లో ఉప నదుల్లో చేపలు వేటకు వెళ్లే వారిని కట్టడి చేయాలని, రైతులు పశువులు కాపరులు వాగులు వంకలు దాటకుండా కట్టడి చేయాలని,వరదలతో పూర్తిగా నిండిన చెరువులు వద్ద కట్టలు తెగకుండా నీటి పారుదల శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీఫ్ కు మంత్రి తుమ్మల దిశా నిర్దేశం చేశారు.

## వైద్యరంగంలో కొత్తగూడెం జిల్లా కేంద్రం మరింత బలపడాలి



కొత్తగూడెం, ఆగస్టు 29 (ప్రజాజ్యోతి ): ఏజెన్సీ గ్రామాలకు కేంద్రంగా ఉన్న కొత్తగూడెం పట్టణం వైద్యరంగంలో మరింత బలోపేతం కావాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పేర్కొన్నారు. కొత్తగూడెం పట్టణంలోని ఓల్డ్ డిపో ఏరియాలో నూతనంగా ఏర్పాటుచేసిన 'శ్రీ ఉషా మల్టీ స్పెసిలిటీ అండ్ డయాలసిస్ ఆస్పత్రిని' శుక్రవారం అయన ప్రారంభించి, ఆస్పత్రి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వైద్యశాల వివిధ జబ్బులు, ప్రాణాంతక వ్యాధులు, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న పేద వర్గాల ఆధునిక వైద్య సౌకర్యంలో అందుబాటులోకి వస్తుండటం శుభపరిణామమన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు కేవలం లాభాల కోసం కాకుండా ప్రజాసేవా భావంతో ముందుకు రావాలని, బలహీన వర్గాల ప్రజలకు తక్కువ ధరల్లో అవసరమైతే ఉచిత సేవలు అందించే దిశగా కృషి చేయాలని సూచించారు. వైద్యసేవలు అందరికీ హక్కుగా మారేలా ప్రభుత్వము కూడా ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించి, పేదలకు సహాయం అందించాలి అని సూచించారు. ప్రారంభ కార్యక్రమంలో వైద్యులు నాగరాజు, విజయకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, మైనార్టీ సంఘాల రాష్ట్ర నాయకులు నయీమ్ ఖురేషి, మాజీ కౌన్సిలర్లు యూసుఫ్, ధర్మరాజు, బోయిన విజయ్ కుమార్, పి సత్యనారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి క్యాంటీన్ మూసివేత

- **సెప్టెంబర్ 1 నుంచి బంద్ చేయనున్న వైనం**
- **నూతన ఓసి ప్రారంభమయ్యేంత వరకు ఇలానే?**
- **సర్కులర్ జారీ చేసిన యాజమాన్యం**



ఇల్లందు, ఆగస్ట్ 29, ప్రజాజ్యోతి: ఇల్లందు ఏరియా వైద్యశాలలో ఏర్పా టు చేసిన క్యాంటీన్ ఎత్తివేస్తూ సింగరేణి యాజమాన్యం గురువారం సర్కులర్ జారీ చేయడం జరిగింది. గడిచిన ఆరు నెలల క్రితం అప్పటి జియం జాన్ ఆనంద్ కార్మికు లు, ఉద్యోగులకు అల్పాహారం, టీ, టిఫిన్లు అందుబాటులో ఉండాలని ఉద్దేశంతో గని మూసివేసిన అనంతరం సింగరేణి ఏరియా వైద్యశాలలో ఈ క్యాంటీన్ అందుబాటులోకి తీసుకువచ్చారు. నేడు క్యాంటీన్ ను ప్రస్తుత అధికారులు ఎత్తివేస్తున్నట్లు సర్కులర్ జారీ చేయడం పట్ల అటు ఉద్యోగులు అధికారులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. మరి ముఖ్యంగా ఇలా సర్కులర్ జారీ చేయడం పట్ల విస్మయానికి గురయ్యారని తెలుస్తుంది. ఈ క్యాంటీన్లో ప్రస్తుతం ఇద్దరు పర్మనెంట్ ఉద్యోగులు, మరో ముగ్గురు కాంటాక్ట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. క్యాంటిన్ మూసి వేయడం మూలాన వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడం లేదా డిప్యూటేషన్ పై పంపడం జరుగుతుందని తెలుస్తుంది. కాంట్రాక్ట్ కార్మికులను తొలగించే అవకాశం లేకపోలేదు. ఇది ఇలా ఉండగా జెకే –5 ఎక్స్టెన్షన్ పూసపల్లి ప్రారంభమైన తర్వాత క్యాంటీన్ ను పున ప్రారంభిస్తున్నామని సర్కులర్ లో పేర్కొన్నారు. క్యాంటీన్ మూసివేతపై గుర్తింపు, ప్రాతినిద్య, ఇతర కార్మిక సంఘాలు సైలెంట్ గా ఉండడం ఏమిటో అర్థం కానీ పరిస్థితి నెలకొందని కార్మికులు వాపోతున్నారు. కార్మిక సంఘాలకు ముందస్తుగా ఏమైనా సమాచారం ఉందా లేదా అనేది తెలియాల్సి ఉంది. ఏది ఏమైనా యాజమాన్యం ఒక్కొక్క శాఖను మూసివేస్తూ ఇక్కడి కార్మికులు ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తూ న్నట్లు స్పష్టమవుతుందని కార్మికులు గుసగుసలాడుకుంటున్నారు. జేకే ఓసి తొలగింపు ప్రాజెక్ట్ (పూసపల్లి ) ఇప్పట్లో ప్రారంభం అయ్యే అవకాశం లేనందుననే ఇలా క్యాంటీన్ మూసి వేస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


## నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వినియోగదారులను ఆకర్శించాలి

- **పేదవర్గాలను దృష్టిలో ఉంచుకొని నిత్యావసర ధరలు నిర్ణయించాలి**
- **న్యూ బిగ్ బజార్ ను ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపిన సాబీర్ పాషా**



కొత్తగూడెం, ఆగస్టు 29 (ప్రజాజ్యోతి ): స్థానిక ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన సరుకులు అందించడం ద్వారా వినియోగదారులను ఆకర్శించి వ్యాపారాభివృద్ధి సాధించాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని ఎంజి రోడ్డులో శుక్రవారం 'న్యూ బిగ్ బిగ్ బజార్'ను ప్రారంభించి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ మార్కెట్ వ్యవస్థలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు సాధారణ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని న్యాయమైన ధరలు నిర్ణయించాలి అని సూచించారు. చిన్న వ్యాపారులు, కూలీ వర్గాల ప్రయోజనాలను కాపాడే విధంగా వ్యాపారం సాగాలని సూచించారు. కొత్తగూడెం పట్టణం వ్యాపార, వాణిజ్య రంగంలో వేగంగా ఎదుగుతున్నదని, ఇలాంటి కొత్త సంస్థలు ప్రారంభమవడం ద్వారా ప్రజలకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని, నియోజకవర్గం అభివృద్ధి సాదిస్తుందని వారు పేర్కొన్నారు. వ్యాపారులు సామాజిక బాధ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం పట్టణంలోని బస్టాండు ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేసిన గోదావరి వంటకాలు స్వీట్ షాపును ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నాగ సీతారాములు, మాజీ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, మాజీ కౌన్సిలర్లు యూసుఫ్, ధర్మరాజు, బోయిన విజయ్ కుమార్, పి సత్యనారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణపతి కుంకుమ పూజలు



టేకులపల్లి,ఆగష్టు29, ప్రజా జ్యోతి:టేకులపల్లి క్రాఎస్ రోడు యూత్ గణేష్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపంలో మహిళా మణులచే ఘనం గా కుంకుమ పూజలు నిర్వహించారు. గణేష్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిఏట గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి వివిధ రకాల పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రాణి కోటి సుభిక్షంగా ఉండాలని వానలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పండి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మహిళా మణులు కుంకుమ పూజలు నిర్వహించి, గణనాథుడి ఆశీర్వాదం తీసుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గణేష్ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.